క్లుప్తంగా

ఉద్యానవనాల పెంపకాన్ని విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యానవనాల పెంపకాన్ని విస్తృతం చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలతో గురువారం సమావేశమైన ఆమె ఉపాధి హామీ పథకం ద్వారా కొండపోడు పట్టాలు ఉన్న వారికి 150 రోజుల పనిదినాలు కల్పించాలని తెలిపారు. ప్రతీ మండలంలో 100 ఎకరాల వరకు హార్టీకల్చర్ ప్లాంటేషన్ చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. వర్షాకాలంలో కూడా ఉపాధి పనులు చేయించి, వేతనదారులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో చిదిమి-పాలమెట్ట రోడ్డు నిర్మాణం



చిదిమి-పాలమెట్ట రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: మండలంలోని చిదిమి-పాలమెట్ట రోడ్డును రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్నామని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు తెలిపారు. గురువారం రోడ్డును పరిశీలించిన ఆయన నిర్మాణానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిందని పేర్కొన్నారు. నిధులు వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పాలవలస విక్రాంత్‌లకు కృతజ్ఞతలన్నారు.

మలేరియా, డెంగీ రాకుండా జాగ్రత్త వహించాలి



ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

సీతంపేట: మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా జాగ్రత్త వహించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయపార్వతి అన్నారు. మండలంలోని టిటుకుపాయి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకోట, టిటుకుపాయిగూడ గ్రామాల్లో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని, ఇంటి ముంగిట మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



రాయగడజమ్ములో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడం ద్వారా పంటలకు ఎంతో మేలు జరుగుతోందని ఏపీ సీఎస్ఎఫ్ నేచురల్ ఫార్మింగ్ అసోషియేట్లు జి.అర్ణపూర్ణ, మానస, శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని రాయగడజమ్ము, చాపరాయిబిన్నిడి గ్రామాల్లో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడంపై అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి, పొలంలో చల్లుకోవడం ద్వారా విత్తనాలు, పంటకు చీడపీడలు, తెగుళ్లు సోకకుండా ఉంటాయన్నారు. అలాగే మొలక శాతం బాగా పెరిగి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఎస్ఎఫ్ ఎంటీ జి.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేత్రవైద్య శిబిరం



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలోని వీవర్స్ కాలనీలో డాక్టర్ వైఎస్సార్ నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారి కళ్లను వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. అనంతరం కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడంపై పలు సూచనలు, సలహాలు చేశారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒబ్బంగి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒబ్బంగి, సాకి, సాకిగూడ, తియ్యాలి, తియ్యాలిగూడ, లిక్కిడి, లిక్కిడిగూడ, తియ్యాలివలస, ఫీరంగూడ, తోలుమానుగూడ, కోసింగూడ, జలుబుగూడ, బుడ్డడుగూడ, రెల్లిగూడ గిరిజన గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో ఎన్నికలప్పుడు మాత్రమే నాయకులు ప్రజలకు కనిపించేవారని, అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల వద్దకే నాయకులు వచ్చి, సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, అందుకే ప్రతీ కుటుంబానికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు పాలనలో స్పష్టమైన తేడా ఉందన్నారు. గతంలో ఏ రకమైన ప్రభుత్వ సేవలు కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయాల్లోనే ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు దొరుకుతున్నాయన్నారు. మరోసారి టీడీపీ అండ్ కో అబద్ధపు హామీలతో మోసగించేందుకు సిద్ధమైందని, ప్రజలు గమనించాలన్నారు. సీఎం జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.

కార్యక్రమంలో ఒబ్బంగి గ్రామ సర్పంచ్ నూకాలమ్మ, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, జెడ్పీటీసీ సుజాత, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, మొండెంఖల్ ఎంపీటీసీ గుడారి విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో 'సంక్షేమ' కాంతులు



సీతంపేట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గిరిజనులతో మమేకమై, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: రాష్ట్రంలో నవరత్నాలు పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూతికవలస గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న చింతమాను కాలనీ, పీవీ ఈతమానుగూడ, గురండి, చావిడిపాడు, పుట్టిగాం, కోమటిగూడ గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజల బాగోగుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తుంటారని, అందుకే ఆయన అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఆయదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలో ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అలాగే ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



చుక్కల సుష్మశ్రీ (సీతంపేట జెడ్పీ హైస్కూల్) | దూబ హర్షవర్ధన్ (సీతంపేట జెడ్పీ హైస్కూల్) | కొండగొర్రె చందన (సీతంపేట జెడ్పీ హైస్కూల్) | బుడ్డి సిద్ధు (సీతంపేట జెడ్పీ హైస్కూల్) | దొంకాడ రేణుక (సీతంపేట జెడ్పీ హైస్కూల్) | కేవటి రేవతి (బాలేరు జెడ్పీ హైస్కూల్) | సంగిరెడ్డి లలిత (కురుపాం జెడ్పీ హైస్కూల్)



బిడ్డిక మణికంఠ (భామిని ఏపీ మోడల్ స్కూల్) | గౌడు సంధ్య (భామిని ఏపీ మోడల్ స్కూల్) | వంజరాపు కార్తీక్ (బిటివాడ జెడ్పీ హైస్కూల్) | సీహెచ్ గోపీనాథ్ (బిటివాడ జెడ్పీ హైస్కూల్) | ఎస్.వెంకటలక్ష్మి (బిటివాడ జెడ్పీ హైస్కూల్) | ఎన్.జోగేంద్ర (నీలానగరం జెడ్పీ హైస్కూల్) | కె.రేణుక (రేగులపాడు కేజీబీవీ)



పి.వాగ్దేవి (రేగులపాడు కేజీబీవీ) | బెజ్జిపురం శివ (తలవరం జెడ్పీ హైస్కూల్) | పేర్ల చైతన్య (తలవరం జెడ్పీ హైస్కూల్) | గేదెల కార్తీక్ (వీరఘట్టం జెడ్పీ హైస్కూల్) | పాలవలస సారిక (కత్తులకవిటి జెడ్పీ హైస్కూల్) | నగరి రూన్సీరాణి (తెట్టంగి జెడ్పీ హైస్కూల్) | వారణాసి హాసిణి (కురుపాం జెడ్పీ హైస్కూల్)



నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కురుపాం మోడల్ స్కూల్ విద్యార్థిని కర్రి తనూశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వసుంధరరావు

రాష్ట్ర వ్యాప్తంగా పలు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గురువారం ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వారు సాధించిన మార్కుల ఆధారంగా ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళంలోని విద్యాసంస్థల్లో సీట్లు సాధించారు. ఈ నేపథ్యంలో వారిని పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, బంధుమిత్రులు అభినందిస్తున్నారు. ఉన్నత విద్యనభ్యసించి, జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను అందరూ ప్రశంసిస్తున్నారు. వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు, మరెన్నో రకాల ప్రభుత్వ సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పారదర్శకంగా సేవలు అందుతుండడంతో లబ్ధిదారులు వలంటీర్ల సేవలను అభినందిస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ వ్యవస్థ ఓ రక్షణ కవచంలా ప్రజల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకుంటున్నారు.

-కురుపాం సాక్షి నెట్‌వర్క్

కరోనా కాలంలో అండగా నిలిచారు..



కరోనా కష్టకాలంలో మా వలంటీర్ అండగా నిలిచారు. లాక్‌డౌన్ కారణంగా ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి. వలంటీరే నేరుగా మా ఇంటి వద్దకు ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ సరుకులు తెచ్చి, ఇచ్చేవారు. పెన్షన్ కూడా అందజేసేవారు. దీంతో కరోనా తీవ్రత, పాజిటివ్ కేసుల సంఖ్య తగ్గింది. వలంటీర్ల సేవలు చాలా గొప్పవి. అటువంటి వారిపై నిందలు వేయడం సరికాదు.

-బొత్స సావిత్రి, శివ్వాల వీధి, కురుపాం.

ఆస్పత్రి దగ్గరకే పెన్షన్..



అనారోగ్యం కారణంగా పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు నాకు నెలనెలా మా వలంటీరే నా దగ్గరకు వచ్చి, పెన్షన్ అందించారు. వలంటీర్ల సేవలు మరువలేనివి. ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పథకం ఇంటికి తెస్తున్నారు. వలంటీర్ల గురించి, చెడుగా మాట్లాడకూడదు. వారు లేకపోతే ప్రభుత్వ సేవల కోసం మళ్లీ మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

-రామినం అన్నపూర్ణ, తెలగవీధి, కురుపాం.

వలంటీర్ల సేవలు సూపర్..



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వలంటీర్ల సేవలు సూపర్. నాకు దృష్టిలోపం కారణంగా ఎక్కడికీ కదలలేను. ఈ క్రమంలో మా వలంటీర్ నాకు ఆరోగ్య తనిఖీలతో పాటు అవసరమైన మందులు అందేలా చేశారు. అలాగే ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షన్ ఇంటికి తెచ్చి, అందిస్తున్నారు. అటువంటి వలంటీర్లను అవమానించకూడదు. వీలైతే అభినందించాలి.

-మావూరి పాపయ్య, ఉల్లిబద్ర గ్రామం, గురుగుబిల్లి మండలం.

భూముల రీసర్వేతో భూ తగాదాలకు చెక్..

పాలకొండ రూరల్:

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేతో భూ తగాదాలకు చెక్ పడిందని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వీరఘట్టం రోడ్డు ప్రాంతంలో చేపడుతున్న భూముల రీసర్వేను ఆయన గురువారం పరిశీలించారు. రైతుల సమక్షంలో సర్వే చేయాలని, కొలతల ప్రకారం పక్కాగా హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సర్వేతో ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు.

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, మొబైల్ డీటీ పి.సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్‌ఓ బలివాడ సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూముల రీసర్వేలో అధికారులు

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు

గ్రామ గ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. గురువారం పలువురి ఇళ్ల వద్దకే వెళ్లి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: కుశిమిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



పాలకొండ రూరల్: లుంబూరులో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



గుమ్మలక్ష్మీపురం: గొయిపాకలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వీరఘట్టం: కిమ్మిలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ జయంత్ ప్రసాద్



గరుగుబిల్లి: సంతోషపురంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ పైడితల్లి



జియ్యమ్మవలస: అల్లువాడలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శశికళ



భామిని: నేరడి-బిలో జగనన్న సురక్ష కార్యక్రమం

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

- డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్



విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనం పరిశీలించి, రికార్డులు చూస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంను మెనూ ప్రకారం పెట్టాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు.

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల విద్యాప్రమాణాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం వంటకాల తీరును పరిశీలించారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. అలాగే బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఎస్.నాగభూషణరావు, ఏపీఓ వై.శంకరరావు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని చినగోర, చినగోర కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ ఆనందరావు గురువారం సందర్శించారు. అనంతరం అక్కడి విద్యార్థుల కోసం వండుతున్న మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని సూచించారు.

విద్యాప్రమాణాల మెరుగుపై ప్రత్యేక దృష్టి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ సోంబాబు

పాలకొండ రూరల్: విద్యాప్రమాణాల మెరుగుపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈఓ కురిటి సోంబాబు సూచించారు. మండలంలోని ఓని గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా నాణ్యమైన విద్యాబోధన విద్యార్థులకు అందించాలని తెలిపారు.